# సారీ డియర్!

**ఆంధ్రభూమి, 11 నవంబరు 99**



"కంగ్రాట్స్! యూ ఆర్ సెలక్టెడ్ యాజ్ మేనేజిమెంటు ట్రెయినీ"

మెగాకమ్ కంప్యూటర్స్ నుంచీ వచ్చిన ఫాక్స్ మెసేజి టేబుల్ మీద రెపరెపలాడుతోంది. దాని లాగే నా మనసుకూడా! అణువణువులోనూ వుల్లాసం, వుత్తుంగ తరంగంలా వువ్వెత్తుని ఎగిసిపడ్తూ నన్ను వుక్కిరిబిక్కిరి చేస్తోంది.

ఇదంతా మెగాకమ్‌లో సెలెక్టైనందుకు కాదు, పది వేల జీతం రాబోతున్నందుకూ కాదు. ఎన్నేళ్ళనుంచో గుండె గూట్లో బంధించి వుంచిన ఒక కోరికకి రెక్కలిచ్చి ఎగరేసే టైమొచ్చినందుకు.

ఫోనందుకుని అపూర్వకి డయల్ చేసాను.

"హలో!' గంభీరమైన గొంతు. అపూర్వకాదు, వాళ్ళ మదర్.

"హలో ఆంటీ!" నన్ను నేను కంట్రోల్ చేసుకుంటూ విష్ చేసి, "అపూర్వ లేదా?" అనడిగాను.

"ఎవరు? వినయ్?" నా గొంతు గుర్తుపట్టి ఎదురు ప్రశ్న వేసింది.

"ఔ నాంటీ. తను లేదా?"

"లేదు. ఫ్రెండ్స్‌తో పిక్చర్‌కి వెళ్ళింది."

ఆ జవాబుతో నేను సగం దిగిపోయాను

"వచ్చాక నన్ను కాంటాక్ట్ చెయ్యమని చెప్పండి" అని బై చెప్పి ఫోన్ పెట్టేసాను.

ఆ తర్వాతేం చెయ్యాలో అర్థంకాలేదు. నా సంతోషాన్ని ఎవర్తోటేనా పంచుకోవాలనుంది. కానీ ఎవరున్నారని? 'నా' అనుకుంటున్న అపూర్వ ప్రయారిటీస్‌లో నేను లేను.

గుండె కొనల్లో ఏమూలో అసహనంగా కదుల్తున్న జ్ఞాపకం!

"ఐహేవ్ నో ఫాదర్. మా డేడీని నక్సల్స్ చంపేసారు." పిన్‌డ్రాప్ సైలెంటుగా వున్న క్లాస్‌రూమ్‌లో చేతులు కట్టుకుని నిలబడి చెప్తున్న అపూర్వ గొంతు! అందులో అంతర్లీనంగావిషాదం!

నేను మొదట షాకయ్యాను. తేరుకుని కొంత క్యూరియస్‌గా చూసాను. ఒకే పడవలో ప్రయాణం - చిన్న తేడాతో, నాకు అమ్మలేదు!

ఆ క్షణాన్నే నాకు తనతో అనుబంధం లాంటిది ఏర్పడింది.

తన భుజం మీద చెయ్యేసి నీకు నేనున్నాని చెప్పాలనిపించింది. అప్పుడు నా వయసు పన్నెండేళ్ళు.

***

నాకు వూహ తెలిసేసరికే అమ్మ చనిపోయింది. ఆమె స్థానంలోకి పిన్ని వచ్చింది. పిన్నికి

పాపా, బాబు. నాకూ వాళ్ళకీ స్పష్టమైన గీతగీసినట్టు ఎడం. ఇంట్లో నేను సెకండ్ కేటగిరీ సిటిజన్ని. నా ప్రతి కదలికనీ పిన్ని చూపులు నిశితంగా గమనించేవి. అన్యాపదేశంగా నిర్దేశించేవి. డిసిప్లిన్ ముసుగులో ఇదంగా సైలెంటుగా జరిగిపోయేది. నేను కొంత సంఘర్షించేవాడిని. తర్వాతేనా రాజీ తప్పనిసరయేది. నా భావాలు, ఆలోచనలు నిర్దాక్షిణ్యంగా కండిషన్ చెయ్యబడేవి.

అప్పుడప్పుడు నా కళ్ళలో కదిలే ఆవేదని గుర్తించేది అపూర్వ. "నువ్వు మరీ ఎక్కువగా బాధపడ్తున్నావేమో! మీ మదర్ వున్నా కూడా ఇలాగే ఆలోచించేదేమో!" అంది ఒకసారి.

నేను విషాదంగా నవ్వాను. "ప్రేమతో విషాన్ని తినిపించవచ్చుగానీ ద్వేషంతో అమృతాన్ని తాగించలేరట. నేను బాధపడేది డిసిప్లిన్ని నా మీద ఒక బాధ్యతలా చేసే బదులు ఒక్కమాటు ప్రేమగా దగ్గిరకి పిలిచి ఇలా చెయ్యకు అలా చెయ్యి - అని మృదువుగా చెప్పచ్చుకదా? మా పిన్ని కాకపోతే కనీసం మా నాన్నేనా?" అన్నాను.

అపూర్వ దగ్గిర జవాబులేదు.

నేనేది చెప్పబోయినా నెగెటివ్ యాటిట్యూడ్ డెవలప్ చేసుకుంటున్నానో, సినిగ్గా తయారౌతున్నాననో నన్నే కోప్పడేది. "అఫ్టాల్ వాళ్ళెవరు? నీ పేరెంట్స్. మీ పిన్ని విషయం వదిలెయ్. డాడీకైతే నీ క్షేమమే కదా కావల్సినది? నిన్ను హర్ట్ చేస్తేనూ, స్పాయిల్ చేస్తేనూ నష్టపోయేది ఆయనేకదా వినయ్? మీ మధ్య కమ్యూనికేషన్ గేప్ చోటుచేసుకుంది. నువ్వు నీ ఫీలింగ్స్ని సప్రెస్ చేసుకుని ఇంట్రావర్ట్గా తయారైతే వాళ్ళకెలా తెలుస్తుంది?" అని కూడా అంది.

నేను నవ్వేసి వూరుకున్నాను. అనుభవించేవాడి బాధ చూసేవారికి తెలీదు. నాకు బాగా విస్మయాన్ని కలిగించే విషయం ఒకటుంది. అపూర్వ తన తండ్రిని ఎప్పుడూ గుర్తుచేసుకునేదికాదు. భావాలని మనసనే డబ్బాలో వేసి సీల్ చేసేసి ఆ క్లోజ్డ్పేక్ని నీట్గా ప్రెజెంట్ చేసేది.

"నీకు మీ నాన్నగారు గుర్తురారా?" ఒకసారి అడిగేసాను.

"మర్చిపోతేకదా?" ఎదురడిగింది.

"మరి?" ఆ తర్వాత ఏం అడగాలో తెలీలేదు. కానీ ఆ అడగలేకపోయినదేమిటో తను గ్రహించింది.

"డేడీ పోయినప్పటికి నాకు ఎనిమిదేళ్ళు. పేపర్స్లో రాస్తుంటారే అలా చనిపోయారు. అమ్మా నేనూ మిగిలాము. అప్పటిదాకా సెక్యూర్డ్గా ఎంతో హాయిగా వున్న మా జీవితాల్లో ఒక్కసారి మార్పొచ్చింది. కన్నీళ్ళు తుడుచుకోవటం... వాటిని దిగమింగుకోవటం..."

నేను నిశ్శబ్దంగా విన్నాను. తల్లీకూతుళ్ళు ఒకరికొకరు వున్నారు. ఒకరి కన్నీరు మరొకరు తుడుస్తారు. మధ్యలో ఇంకెవరూ లేరు. నా ఆలోచనలు అక్కడ ఆగిపోయాయి.

".... నేను చదువులో వెనకపడ్డాను. అప్పుడు అమ్మలో మార్పొచ్చింది. చనిపోయినవాళ్ళకోసం ఎంత కాలం ఏడుస్తాం? ఏడిస్తే వాళ్ళు తిరిగొస్తారా? అని కోప్పడింది. తన మనసు రాయి చేసుకుంది. అమ్మకోసం నేనూ అలాగే తయారయ్యాను."

"...."

"మా దృక్పథాల్లో ఇంకా మార్పొచ్చింది. అమ్మది సంధ్య వాలుతున్న జీవితం. నాదింకా వికసించాల్సిన వయసు. ఎవరి అనుభవాలూ, ఎవరి అనుభూతులూ వారివి. పర్యవసానాలూ అంతే. చనిపోయింది తన భర్త కాబట్టి అమ్మది ఒక తరహా దు:ఖం. దాన్ని ఎవరూ తీర్చలేరు. ఆమెని ఎవరూ వోదార్చలేరు. ఏ వోదార్పూ అనంతసాగరమంటి ఆమె దు:ఖంలో ఒక బిందువుకి

సరిరాదు. మరి ఆయన నా తండ్రిగాబట్టి నా జీవితాన్ని అంతగా ప్రభావితం చెయ్యలేదు. ఐనా దు:ఖం దు:ఖమే. దాన్ని పదే పదే గుర్తుచేసుకోవడం, ఇంకొకరికి పంచటం నాకు నచ్చదు."

తన మాటల్ని నేను పదే పదే మననం చేసుకున్నాను. నేనూ అలాగే వుండటానికి ప్రయత్నించానుగానీ సాధ్యపడలేదు. మనిషికో భిన్నప్రవృత్తి.

నా దు:ఖాన్ని ఎవర్తోటేనా పంచుకోవాలని నాకెంతగానో వుంటుంది. సంతోషాన్ని కూడా....

***

గతంలోంచీ వాస్తవంలోకి వచ్చాను.

ఆరింటికి అపూర్వ ఫోన్ చేసింది. నా సెలక్షన్ గురించి చెప్పాను. ఎంతో కలర్‌ఫుల్‌గా వూహించుకున్న సన్నివేశం అంతకంతకీ స్టేల్‌గా తయారైంది.

"కంగ్రాట్స్, పార్టీ ఎప్పుడు?" సంతోషంగా అడిగింది.

"ఇప్పుడే." డిటర్మైన్డ్‌గా చెప్పాను "అశోకాలో."

"ఇప్పుడా? మమ్మీ ఏమంటుందో?" సందిగ్ధంగా అంది.

"ప్లీజ్, నీతో మాట్లాడాలి."

"నాతోనా?"

"ఎందుకంత ఆశ్చర్యం?"

"మనం రోజూ మాట్లాడుకుంటూనే వున్నాంగా?"

నాకు కొంచెం కోపం వచ్చింది. ఏమిటి తను? బోయ్ మీట్స్ గాళ్ కథలే చదవనట్టు ఇంత యిమ్మెచ్యూర్డ్‌గా మాట్లాడుతుందేమిటి?

"సరే! టెన్‌మినిట్స్‌లో అక్కడుంటాను. నీదే ఆలస్యం" అంది. తన గొంతులో అదోలాంటి మార్పు. నేను అప్పుడంతగా పట్టించుకోలేదు.

***

అశోకాలో డిమ్‌లైట్‌లో అపూర్వ చాలా బావుంది. తనని యీ దృష్టితో ఎప్పుడూ చూడలేదేమో నాకు చాలా వుద్విగ్నంగా వుంది.

దేవుడు మొదట అందాన్ని సృష్టిస్తాడు. దాన్ని నింపడానికి స్త్రీని సృష్టిస్తాడు. యౌవనమనే వంపుని సృజిస్తాడు. అపూర్వలో ఆ వొంపు అద్భుతంగా వుంది.

కార్న్‌సూప్, మంచూరీ ఆర్డరిచ్చాను.

"ఏ పిక్చర్‌కెళ్ళారు?" కేజువల్‌గా అడిగాను. ఈజ్‌కోసం ప్రయత్నించాను.

"దిల్‌సే."

"బావుందా?"

"మనీషా బావుంది."

"ఏదీ డైరెక్టుగా చెప్పవు."

"హీరోయిన్ బావుంటే పిక్చర్ బావున్నట్టేనా?.... సరేగానీ ఏంటి మాట్లాడాలన్నావు?" సూప్‌ని చెమ్చాతో కదుపుతూ అడిగింది.

నా మనసులో కువకువలాడుతున్న భావాలకి ఆమెదాకా ఎలా సోపానాలని పరవాలా అనుకుంటుంటే తనే డైరెక్టుగా టాపిక్‌లోకి వచ్చేసింది. నాకేసి సునిశితంగా చూసి తలొంచుకుంది. తనకి నా మనసు అర్థమైందా?!

"నాకు జాబొచ్చింది. ఇంతకాలం అందుకోసమే ఆగాను. అపూర్వా! డూయూ లవ్ మీ?" అడిగాను.

అపూర్వ వెంటనే జవాబివ్వలేదు. సూప్ సిప్ చేస్తూ మౌనంగా కూర్చుంది. తననుంచీ నెగెటివ్ రిప్లై వస్తుందన్న అనుమానం నాకెంతమాత్రం లేదు. నా మనస్సులో వున్నది అడిగేసాక... చాలా చిత్రంగా నా టెన్షనంతా తగ్గిపోయింది.

"ఇందాకా ఫ్రెండ్సుతో పిక్చర్ని చాలా ఎంజాయ్ చేసాను. కానీ మనిద్దరిమధ్య వాతావరణం ఇంత బరువుగా వుంటుందేం వినయ్?" హఠాత్తుగా అడిగింది.

"అందుకే దూరంగా వెళ్ళిపోదాం."

తను నవ్వింది. "మన జీవితాల్లోని విషాదం మన నుంచీ దూరంగా వెళ్ళదుగా?" అది ఒక భాగమైపోయింది. అందుకే... మనం పంచుకున్నా పెంచుకున్నా విషాదమే!"

తన భావం లీలగా స్ఫురించి... అప్పుడు నేను షాకయ్యాను. గుండెల్ని మెలిపెట్టేసేంత బాధ మొదలైంది.

"అ..పూ...ర్వా!!"

"ఒక్కొక్కసారి ఈ జీవితం నా భుజాలకి ఎంతో బరువుగా వేళ్ళాడుతున్నట్టనిపిస్తుంది. నాట్ టూ హర్ట్ యూ... ముఖ్యంగానీతో మాటాడాక. నువ్విలా అడుగుతావని ఎప్పుడో వూహించాను. నా జవాబు ఒకటే - అయాం సారీ!"

"ఎందుకని?" అతికష్టం మీద అడిగాను. నా వ్యక్తిత్వాన్నీ మనస్తత్వాన్నీ తనెప్పుడూ విశ్లేషిస్తుంటుంది. తన విశ్లేషణ ఎప్పుడూ తప్పదు. ఇప్పుడు తన జవాబు దానిమీదే ఆధారపడి వుంది. అందుకే అదీ త..ప్ప..వ..దు!!

"చెప్పానుగా, మన మధ్య విషాదం ఘనీభవించి వుందని. మనం పెళ్ళిచేసుకుంటే ఒకరి కన్నీరు ఒకరం తుడుచుకుంటూ గడపాలి. అది నాకు నచ్చదు." చాలా స్పష్టంగా చెప్పింది. ఎప్పుడూ తన దు:ఖాన్ని బైటికి వ్యక్తపరచని అపూర్వకి... తండ్రిలేకపోవటాన్ని చూపించి సింపతీ కోరుకోని అపూర్వకి... తనున్న చట్రంలోంచీ బైటపడాలని సంఘర్షించే అపూర్వకి... నా దు:ఖం అదనపు భారమౌతుందనే చిన్న వూహ స్ఫురించింది.

"నాకు నాన్న లేకపోవటం, నీకు అమ్మ లేకపోవటంతో జీవితంలో మనం చాలా మిస్ అయ్యాం. మా అమ్మ.. చాలా టఫ్‌గా వుంటుంది. ఒకవైపు దు:ఖంతోటీ మరోవైపు తనని సుఖసంతోషాలకి దూరంచేసిన సమాజంతోటీ నిత్యం సంఘర్షిస్తూ వుండే ఆవిడ ప్రేమయికాదు. ఎవరికీ ప్రేమని పంచివ్వలేదు. ముందు ఆవిడకి ఒక సొర్సాఫ్ రిలీఫ్ కావాలి. నువ్వాశించే ప్రేమైక వాతావరణం మా యింట్లో దొరకదు.. ఎట్ దిసేమ్ టైమ్..."

తను చెప్పకుండానే తర్వాతది నాకర్థమైంది. నాకు నా పేరెంట్సుతో ఎటాచ్‌మెంట్ లేదు. పెద్దవాళ్ళ మధ్య సెక్యూర్డ్‌గా గడపడం అనే తన కోరికని నేనూ తీర్చలేను. పెళ్ళైన తర్వాతకూడా మా జీవితాల్లో  ఏ మార్పూ వుండకపోవచ్చు. కానీ... అపూర్వని దూరం చేసుకుని నేను బతకగలనా?

ఎండమావి అని తెలిసీ సహజీవనం చెయ్యటం ఎందుకు? గుండెల్ని చిదిమేస్తున్న బాధ క్రమంగా సన్నగిల్లింది. తుఫాను వెలిసిన తర్వాత వుండే ప్రశాంతత లాంటిది నాలో నిండింది.

"అయాంసారీ అపూర్వా" అన్నాను.

"అర్థం చేసుకున్నావు. థేంక్స్" అంది తను.

"జాబ్ విషయం ఇంట్లోచెప్పావా?" అని తనే మళ్ళీ అడిగింది.

"లేదు. ముందుగా నీకే చెప్పాలనిపించింది" అన్నాను.

అలా చెప్పటంలో నాకే సంకోచమూలేదు. ఎందుకంటే..స్టిల్ ఐ లవ్ హర్! ద్వేషించటంలేదు.

"ఇష్ష్. నువ్వెప్పుడు మారతావు వినయ్? ఒక్కటి గుర్తుపెట్టుకో. మనిషి భావాలన్నీ రెసిప్రొకేట్ ఔతూవుంటాయి. నువ్వేడుస్తూ వున్నావనుకో, నీ చుట్టూ వున్న వాతావరణం మూగవోతుంది. నువ్వు అవతలివాళ్ళపట్ల టఫ్‌గా వుంటే వాళ్ళూ అంతే" అంది.

"సారీ డియర్!" మరోసారి అని లేచాను.